సాక్షి
వనపర్తి
బుధవారం, 31, జూలై, 2024



కృష్ణమ్మ పరవళ్లు
జూరాల ప్రాజెక్టుకు వరద భారీగా చేరడంతో 39 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.
వివరాలు 10లో ▸



చోరీ నిందితుల అరెస్ట్
బస్సులో రూ.36 లక్షలు చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.4 /24.7
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వన మహోత్సవం లక్ష్యాన్ని చేరుకోవాలి



గోపాల్‌పేట: వన మహోత్సవంలో భాగంగా ఇచ్చిన లక్ష్యం మేర మొక్కలు నాటేందుకు ప్రయత్నించాలని జెడ్పీ సీఈఓ యాదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఉమ్మడి మండలంలో 78 శాతం అనగా 60,300 మొక్కలు నాటామని.. మిగతా మొక్కలు నాటి టార్గెట్ పూర్తి చేస్తామని ఏపీఓ నరేందర్ తెలిపారు. ప్రతి ఇంటికి శుద్ధ జలం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్రం, ప్రత్యేక అధికారిణి లక్ష్మీబాయి, ఎంపీడీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుకు మద్దతు ధర కల్పించాలని వినతి



అమరచింత: చెరుకుకు మద్దతు ధర కల్పించాలని కృష్ణవేణి చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. చెరుకు రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న వివరించారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం చెరుకు రైతులకు టన్నుకు రూ.వెయ్యి ఇచ్చి ఆదుకోవాలని కోరామన్నారు. వరి పంట మాదిరిగా చెరుకుకు కూడా బోనస్ ప్రకటించాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిలిచిన డ్రిప్ పరికరాల రాయితీని తిరిగి కొనసాగించాలన్నారు. చెరుకు రైతులనే సీడీసీ చైర్మన్, మెంబర్లుగా నియమించేలా విధానాలు రూపొందించాలని కోరినట్లు తెలిపారు. చెరుకు రవాణా సమయంలో ఆర్టీఏ, పోలీసులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. సీఎంను కలిసిన వారిలో చెరుకు రైతు సంఘం నాయకులు వాసారెడ్డి, నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 900 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

రైతు సంబురం

జిల్లాలో రెండోవిడత రుణమాఫీ లబ్ధిదారులు 16,527

- సీఎం, మంత్రుల ప్రసంగాలు వీక్షించేందుకు కలెక్టరేట్‌లో స్క్రీన్లు ఏర్పాటు
- రైతులతో కలిసి తిలకించిన కలెక్టర్, అధికారులు
- సందేహాల నివృత్తికి కంట్రోల్‌రూం ఏర్పాటు



వనపర్తి: పంట రుణం రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల లోపు తీసుకున్న రైతులకు ప్రభుత్వం మంగళవారం రెండోవిడతలో రుణ మాఫీ వర్తింపజేసింది. తొలిసారి మాదిరిగానే.. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందేశం రైతులు వీక్షించేందుకు అధికారులు కలెక్టరేట్, గ్రామాల్లోని రైతువేదికల్లో ప్రత్యేకంగా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. రెండోవిడతలో జిల్లావ్యాప్తంగా పీఏసీఎస్‌లు, ఆయా బ్యాంకుల పరిధిలోని 16,527 మంది రైతు కుటుంబాలకు రూ.154.58 కోట్లు విడుదల చేశారు. పీఏసీఎస్‌లు, బ్యాంకులకు రైతుల జాబితా, నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఎం.నగేష్, డీఏఓ సుధాకర్‌రెడ్డి రైతులతో కలిసి సీఎం, మంత్రుల ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడత రూ. లక్ష పంట రుణమాఫీతో జిల్లాలోని 27,066 మంది రైతుల పంట రుణ ఖాతాలో రూ.145.55 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. వివిధ కారణాలతో 1,140 మందికి రుణమాఫీ వర్తించలేదని.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

అర్హులై ఉండి పంట రుణమాఫీ వర్తించని రైతుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రైతులు ఇక్కడ ఫిర్యాదు నమోదు చేసుకుంటే.. అధికారులు విచారణ చేసి అర్హత ఉంటే ఆలస్యంగానైనా రుణమాఫీ వర్తింపజేస్తారు. బ్యాంకు పాస్ పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డుల్లోని పేర్లలో వ్యత్యాసం కారణంగా కొందరు రైతులకు మాఫీ వర్తించలేదని తొలి విడతలో వచ్చిన ఫిర్యాదులతో స్పష్టమవుతోంది. కంట్రోల్ రూమ్‌నంబర్లు 08545-220351, 545-233535కు కాల్‌చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెండోవిడత రుణమాఫీ వర్తింపు కార్యక్రమంలో బ్యాంకు, సహకారశాఖ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

బ్యాంకుల వారీగా రెండోవిడత రుణమాఫీ వివరాలు

బ్యాంకు	రైతుల సంఖ్య	రుణమాఫీ మొత్తం (రూ.లలో..)
యూబీఐ	4,232	43.98 కోట్లు
ఏపీజీవీబీ	4,303	42.75 కోట్లు
ఎస్‌బీఐ	3,326	35.65 కోట్లు
యూకో	279	25.87 కోట్లు
పీఏసీఎస్‌లు	3,645	22.33 కోట్లు
ఐఓబీ	508	4.82 కోట్లు
కెనరా బ్యాంకు	51	53.69 లక్షలు
పంజాబ్ నేషనల్ బ్యాంక్	57	64.18 లక్షలు
బ్యాంక్ ఆఫ్ బరోడా	47	49.24 లక్షలు
కేబీఎస్	46	37.97 లక్షలు
ఐసీఐసీఐ	24	28 లక్షలు
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	7	7 లక్షలు
హెచ్‌డీఎఫ్‌సీ	2	2.73 లక్షలు

అర్హులందరికీ మాఫీ వర్తింపు..



జిల్లాలోని అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుంది. చిన్న చిన్న పొరపాట్లతో మాఫీ వర్తించకుంటే కంట్రోల్‌రూమ్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలి. విచారణ చేపట్టి మాఫీ వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం చిత్తశుద్ధితో పారదర్శకంగా పథకం అమలు చేస్తోంది.
– సుధాకర్‌రెడ్డి, డీఏఓ, వనపర్తి

చరిత్రాత్మక నిర్ణయం..



కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు పంట రుణమాఫీ చేయడం చరిత్రాత్మక నిర్ణయం. నేను ఉన్న 2.20 ఎకరాల సాగుకోసం వనపర్తి ఏడీబీలో రూ.1.20 లక్షల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం పంట రుణమాఫీ చేయడంతో నేను తీసుకున్న తేరిపోయింది. పేద రైతులందరూ ప్రభుత్వానికి రుణపడి ఉంటారు.
– కుర్మయ్య, రైతు, గోప్లాపూర్ (పాన్‌గల్)

రైతుబాంధవుడు రేవంత్‌రెడ్డి..



రూ.1.50 లక్షల పంట రుణమాఫీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడిగా నిలిచిపోయారు. దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే రుణమాఫీ చేయడం సంతోషంగా ఉంది. పెట్టుబడి సాయం, కౌలు రైతులకు సాయం త్వరగా ఇస్తే బాగుంటుంది.
– భానుప్రకాష్‌రెడ్డి, రైతు, వడ్డెవాట

రూ.1.10 లక్షల రుణమాఫీ అయింది..



నేను ఖిల్లాఘనపురం గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన రూ.1.50 లక్షలలోపు రుణమాఫీలో నాకు రూ.1,10,083 మాఫీ రావడంతో ఆనందం కలిగింది. అలాగే వివిధ కారణాలతో చాలామంది రైతులకు రుణమాఫి వర్తించ లేదు. అధికారులు పరిశీలించాలి.
– కొప్పుట సాయిలు, మల్క్‌మియాన్‌పల్లి, ఖిల్లాఘనపురం

బండ్ల ఘర్ వాపసీ!

మళ్లీ సొంత గూటికి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

- హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో చేరిక
- కాంగ్రెస్‌లో ప్రాధాన్యం దక్కకపోవడమే కారణమా..
- సీఎం కల్వకుర్తి పర్యటనకు పిలుపు రాలేదని ప్రచారం
- 'అలంపూర్' సంగతేమిటని జోరుగా చర్చ
- ఉమ్మడి పాలమూరులో హాట్‌టాపిక్‌గా మారిన పరిణామాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి సొంత గూటికి చేరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడం.. ఎమ్మెల్యేగా గెలుపొందినా నియోజకవర్గంలో సరైన ప్రాధాన్యం దక్కడం లేదనే కారణంతో ఈ నెల ఆరో తేదీన ఆయన గులాబీని వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. నెల రోజులు కాకముందే మనసు మార్చుకున్న బండ్ల మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో అసలేం జరిగింది.. ఆయన ఘర్‌వాపసీకి కారణం ఏమిటి.. కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జోరుగా సాగుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పరిస్థితి ఏమిటనే చర్చ ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా జోరుగా సాగుతోంది.

చేరినా దూరంగానే..

గద్వాల జిల్లాలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మధ్య తొలి నుంచీ విభేదాలు ఉన్నాయి. ఇరువురు బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పటికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేట్టు వారి మధ్య వైరం నడిచింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన సరితకు భంగపాటు ఎదురుకావడంతో కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయినా నియోజకవర్గంలో ఆమెదే పైచేయిగా నిలవడం.. ఎమ్మెల్యేగా ఉన్నా సరైన ప్రాధాన్యం దక్కపోవడం.. మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఉన్న సాన్నిహిత్యంతో బండ్ల కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపారు. ఈ సమయంలో సరిత, ఆమె వర్గీయులు ఆయన రాకను అడ్డుకున్నారు. అయినప్పటికీ సీఎం నివాసంలో బండ్ల హస్తం గూటికీ చేరగా.. అక్కడ సమీపంలోనే ఉన్న సరిత ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కూడా ఎమ్మెల్యే బండ్ల ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు.

'గుర్తింపు' దక్కదనేనా..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన కల్వకుర్తికి వచ్చారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి.. సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సరితకు పిలుపు రాగా.. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి పిలుపు అందనట్లు సమాచారం. కాంగ్రెస్‌లో చేరే ముందు ఇచ్చిన ప్రాధాన్యత.. ఆ తర్వాత దక్కకపోవడంతో బండ్ల పునరాలోచన చేసినట్లు తెలుస్తోంది. తనకు కాంగ్రెస్‌లో ఏమాత్రం ప్రాధాన్యత దక్కదని భావించిన ఆయన తిరిగి సొంతగూటికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వారిద్దరి పరిస్థితి ఏమిటో..

గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన క్రమంలో అలంపూర్‌కు చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి కలిశానని ఆయన ప్రకటన విడుదల చేసినప్పటికీ.. చల్లాతో పాటు ఆయన అనుచరుడైన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హస్తం గూటికి చేరనున్నట్లు ప్రచారం జరిగింది. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో కేసీఆర్ భేటీ కాగా.. ఆ సమావేశానికి చల్లాతో పాటు విజయుడు హాజరుకాకపోవడంతో వారు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమనే ప్రచారం ఊపందుకుంది. చల్లా ఇటీవల మరోసారి సీఎంను కలిసినట్లు ఆయన వర్గీయులు చెబుతుండగా.. ప్రస్తుతం గద్వాల ఎమ్మెల్యే బండ్ల ఘర్ వాపసీతో వారి పరిస్థితి ఏమిటనేది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

1,04,113 మంది.. రూ.1,023 కోట్లు

- 2వ విడతలో రూ.1.50 లక్షల లోపు పంట రుణాలు మాఫీ
- ఉమ్మడి జిల్లాలో 2 విడతల్లో మొత్తం 2,85,067 మందికి లబ్ధి
- మరో 15 రోజుల్లో రూ.2 లక్షల లోపు మాఫీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రుణమాఫీ రెండో విడతకు సంబంధించి మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో 1,04,113 మంది రైతులను రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా గుర్తించింది. వీరు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న రూ.1.50 లక్షల లోపు రుణాలు మొత్తం రూ.1,023 కోట్లు కాగా.. వీటిని మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. తొలి విడతలో ఇప్పటికే రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయగా.. ఉమ్మడి జిల్లాలో 1,80,954 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఆయా కుటుంబాల్లో రైతు బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ.1,072.22 కోట్లు జమ చేశారు. ఇప్పటివరకు రెండు విడతలు కలిసి ఉమ్మడి జిల్లాలో 2,85,067 మంది రైతులకు రూ.2,095.22 కోట్లు మాఫీ అయినట్లు తెలుస్తోంది. కాగా, ఆగస్ట్ 15 నాటికి మూడో విడత రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఉమ్మడి పాలమూరులో 2వ విడత రుణమాఫీ ఇలా..(రూ.కోట్లలో..)

జిల్లా	రైతులు	రుణమాఫీ
నాగర్‌కర్నూల్	32,406	312
మహబూబ్‌నగర్	22,253	219
నారాయణపేట	17,880	186
జోగులాంబ గద్వాల	16,489	166
వనపర్తి	15,085	140

'బీసీ డిక్లరేషన్ అమలుకు పోరాటం'



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఓబీసీ మోర్చా నాయకులు మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించి ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల కోసం కేవలం రూ.9,600 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నామమాత్రంగా నిధులిచ్చి చేతులు దులుపుకొన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 43 శాతం బీసీ రిజర్వేషన్‌ను అమలు చేస్తామని వాగ్దానం చేసిన సీఎం.. బీసీలకు ఎలాంటి రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలివ్వటం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, నాయకులు రామన్‌గౌడ్, గొని వేమారెడ్డి, బుచ్చిబాబు, రవినాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అప్పాయిపల్లి, గోపాల్‌పేట మండలం మన్ననూరు, ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో భూ సేకరణ రైతులకు వారం రోజుల్లో అవార్డు జారీ చేయాలని సూచించారు. గణపసముద్రం, మాధవరావుపల్లి, మామిడిమాడలోని భూ సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్‌శాఖకు సంబంధించి ఇతర సమస్యలు, పునరావాస కేంద్రాలపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం.నగేష్, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ సత్యశీలారెడ్డి, ఈఈలు మధుసూదన్‌రావు, కేశవరావు, పీఆర్ ఈఈ మల్లయ్య, డీఈఈలు పాల్గొన్నారు.

రైతులతో ముచ్చటించిన కలెక్టర్..
పెద్దమందడి మండలం మనిగిళ్లలో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. గ్రామ రైతులతో పంట రుణమాఫీపై ముచ్చటించారు. అనంతరం వనపర్తి మండలం నాగవరం, పెద్దమందడిలోని రైతువేదికలను సందర్శించారు.

అభివృద్ధి పనులు కొనసాగించాలి : మాజీ మంత్రి



కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆయన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘనపురం, బుద్దారం చెరువులకు ప్రత్యేక జీఓలు తీసుకొచ్చి ఆయకట్టును నిర్దేశించామని.. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనుల్లో మార్పులు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. సాగునీటికి సంబంధించిన పనులు ఎలాంటి మార్పులు లేకుండా పూర్తి చేయాలని కోరారు. మామిడిమాడ రిజర్వాయర్ పూర్తి చేయాలని, కర్నెతండా కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతిపాదించిన విధంగా పనులు వేగవంతం చేయాలని, రూ.50 కోట్లతో రామన్నగుట్ట రిజర్వాయర్, ఖాసీంనగర్, రేమద్దుల, అంజనగిరి పరిధిలోని పనుల కోసం టెండర్లు పిలవాలని కోరారు. బుగ్రవాగు చెక్‌డ్యాం కోసం భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాలని, నాగవరం, రాజానగరం పరిధిలో ఉన్న భూములపై దేవాదాయశాఖ నిషేధిత జీఓ ఎత్తివేయాలని కోరారు. సవాయిగూడెం, నాచహళ్లి మధ్యలో ఉన్న జమ్ములతండా రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా పరిస్థితులపై చర్చించారు. మాజీ మంత్రి వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు బి.లక్ష్మయ్య, లక్ష్మారెడ్డి, విజయ్, అశోక్, జోహెబ్, గిరి తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లికి చెందిన గర్భిణి పుష్పలత (22) వాంతులు, కడుపునొప్పితో ఈ నెల 27న అర్ధరాత్రి పెబ్బేరులోని బ్రహ్మారెడ్డి ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించి కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి వెళ్తుండగానే మార్గమధ్యంలో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్యాధికారి డా. జయచంద్ర మోహన్ ఆస్పత్రిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. గర్భిణి మృతికి గల కారణాలు పోస్టుమార్టమ్ రిపోర్టులో తెలుస్తుందని, వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. వారి వెంట ఉప వైద్యాధికారి శ్రీనివాసులు, మాస్ మీడియా అధికారి చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ రవి, మహేశ్వరాచారి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

వీపనగండ్ల: ముసురు వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. వైద్యసిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జ్ ప్రోగ్రాం అధికారి డా. వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, పైలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల నివారణకు మురుగు లేకుండా చూసుకోవడం, పైపులైన్ లీకేజీలను సరిచేయడం, తాగునీటి క్లోరినేషన్, బ్లీచింగ్, మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వివిధ సబ్జెక్టులకు సంబంధించి డీఎస్సీ పరీక్ష రెండు వారాలుగా ప్రశాంతంగా కొనసాగుతోంది. మంగళవారం మొదటి షిఫ్టులో నిర్వహించిన పరీక్షకు జేపీఎన్‌సీ కళాశాలలో 180 మంది విద్యార్థులకు గాను 165 మంది హాజరవగా.. 15 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 78 మందికి 50 మంది హాజరవగా.. 28 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టులో జేపీఎన్‌సీలో 180 మందికి 165 హాజరవగా.. 15 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 184 మందికి 173 మంది హాజరవగా.. 11 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

ఇంటి సజ్జ కూలిపోయి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంటి సజ్జ కూలిపోయి వ్యక్తి మృతిచెందిన సంఘటన తిమ్మాజిపేట మండల పరిధిలోని అమ్మపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మపల్లికి చెందిన బాలరాజు(52) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా.. అకస్మాతుగా ఇంటి బయట సజ్జ కూలిపోయి తలపై పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య తిరుపతమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన కె.రాఘవేందర్(38) ఈ నెల 28న దివిటిపల్లి సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు దుర్మరణం


లక్ష్మయ్య(ఫైల్)

వంగూరు: ట్రాక్టర్ బోల్తాపడి మండల కేంద్రానికి చెందిన రైతు మీసాల లక్ష్మయ్య (75) మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. లక్ష్మయ్య మంగళవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో వరి నాటేందుకు ట్రాక్టర్‌తో కరిగెట చేస్తుండగా ప్రమావశాత్తు అదుపుతప్పి బోల్తాపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషయం తెలుసుకొని పొలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. లక్ష్మయ్య మృతి కుటుంబసభ్యులకేగాక కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చేలా పాలన


మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల ఆకాంక్ష నెరవేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమయ్యారని, రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని, ప్రజల పక్షాన పనిచేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ఉమ్మడి జిల్లా సమీక్ష నిర్వహించి.. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం దృష్టిపెట్టారన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ, వ్యవసాయ రంగం బలోపేతం కోసం సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీనియర్ నేత ఎన్పీ వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే కచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, ఆంజనేయులు, జాకీర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు


సుంకేసుల డ్యాంలో 28 గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

- జూరాలకు ఎగువ నుంచి 2.90 లక్షల ఇన్‌ఫ్లో.. దిగువకు 2.81 లక్షల క్యూసెక్కులు విడుదల

ధరూర్/ దోమలపెంట/ ఆత్మకూర్/ రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 2,90,000 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టు వద్ద 39 క్రస్టు గేట్లు ఎత్తి 2,62,179, విద్యుదుత్పత్తి ద్వారా 19,698 కలిపి మొత్తం 2,81,877 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలానికి వదిలారు. అలాగే కుడి కాల్వకు 658 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్టు-1కు 650, లిఫ్టు-2కు 750, సమాంతర కాల్వకు 900 క్యూసెక్కులు వదలగా.. మరో 45 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.434 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,02,573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో.. 3,02,753 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 70.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2,90,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 30 గేట్లు ఎత్తి 2,77,869 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.459 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

5 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రాల్లోని కేవలం ఐదు యూనిట్లలోనే విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. మంగళవారం ఎగువలో మాత్రమే 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామని జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. కాగా ఇప్పటి వరకు 66.540 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వారు చెప్పారు.

సుంకేసులకు వరద..

సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. సోమవారం 28 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు.. మంగళవారం కూడా 28 గేట్ల ద్వారానే దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి 1,11,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 1,07,246 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.


శ్రీశైలం నుంచి దిగువకు పారుతున్న వరద నీరు

■ శ్రీశైలం ఆనకట్ట వద్ద 10 రేడియల్ క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,91,387 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 25,684 మొత్తం 60,999 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.5 అడుగుల వద్ద 207.4103 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

యూపీలో చోరీ నిందితుల అరెస్ట్


నిందితుల సమక్షంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి తదితరులు

- రూ.36 లక్షలకు గాను రూ.29.25లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

జడ్చర్ల: తెలంగాణ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగులో దాచి ఉంచిన రూ.36 లక్షల నగదు చోరీ కేసు దర్యాప్తు చాలా పకడ్బందీగా చేపట్టినట్లు ఎస్పీ జానకి తెలియజేశారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆమె మంగళవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని మోతీనగర్‌లో నివాసం ఉంటున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ పాలచెర్ల దామోదర్ రూ.36 లక్షల నగదును ఈ నెల 16న కర్నూల్‌లో నివాసం ఉంటున్న తన సోదరి భాగ్యలక్ష్మికి ఇచ్చేందుకు ఇంటి నుంచి బయలుదేరి హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు వచ్చి కడప వెళ్తున్న బస్సు ఎక్కాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ముగ్గురు దొంగలు ఎంబీ షారూఖ్(37), అబ్దుల్ సత్తార్(55), షేఖ్ దిల్షాద్ అహ్మద్(40) కూడా దామోదర్ చేతిబ్యాగులో డబ్బు తీసుకెళ్తున్నాడని గమనించి అదే బస్సు ఎక్కారు. వెనుక, చుట్టు పక్కన సీట్లలో కూర్చున్నారు. దామోదర్‌ను ఏమార్చి ఆయన బ్యాగులోని డబ్బును తమ బ్యాగులోకి మార్చుకుని బ్యాగులోని డబ్బు స్థానంలో నీళ్ల బాటిల్స్‌ను ఉంచారు. జడ్చర్ల వచ్చే సరికి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఇద్దరు దొంగలు బ్యాగుతో బస్సు దిగగా.. మరో దొంగ కొత్త బస్టాండ్‌లో దిగాడు. అనంతరం ముగ్గురు దొంగలు కలుసుకుని హైదరాబాద్‌లోని పహాడిషరీఫ్‌లో తమ నివాసానికి చేరుకున్నారు. అక్కడ తమకు ఉండేందుకు షెల్టర్ ఇచ్చిన ఇద్దరికి రూ.75 వేలు ఇచ్చి అక్కడి నుంచి రైలు ద్వారా ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిజ్నూర్‌కు వెళ్లారు. దొంగిలించిన రూ.36 లక్షల నుంచి రూ.6 లక్షలు తమ అవసరాలకు అక్కడ ఖర్చు చేశారు. మిగతా డబ్బుతో ప్లాట్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఈ నెల 28న తాము మాటు వేసి పట్టుకుని అక్కడి కోర్టులో హాజరుపరిచాం. అక్కడి నుంచి జడ్చర్లకు నిందితులను తీసుకొచ్చి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి మొత్తం రూ.29.25 లక్షలు నగదుతో పాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేస్తున్నామని, నిందితులకు నివాసం కల్పించిన వారికి ఇచ్చిన రూ.75 వేలను కూడా రికవరీ చేస్తామన్నారు.

దర్యాప్తు పోలీసులకు రివార్డులు..

కేసు దర్యాప్తును చురుగ్గా చేపట్టిన జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, ఎస్‌ఐ శివానందం, సిబ్బంది బాలు, వెంకటేశ్, మన్సూర్, గోపాల్‌కు రివార్డులు అందజేసి వారిని ప్రశంసించారు. సమావేశంలో స్థానిక సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్ట్..

ముగ్గురు నిందితుల్లో ఎంబీ షారూఖ్(37), షేఖ్ దిల్షాద్ అహ్మద్(40)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలియజేశారు. ఏ2 గా ఉన్న అబ్దుల్ సత్తార్(55)కు అనారోగ్యం కారణంగా నోటీసు ఇచ్చామని తెలిపారు. నిందితులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి నుంచి డబ్బుల బ్యాగులను గమనించి కాజేస్తారని, వీరిపై 2008లో అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి కేసు నమోదయ్యిందని, వీరిపై మూడు పాత కేసులు ఉన్నట్లు తెలియజేశారు.

సీసీ కెమెరాలే కీలకం..

కేసు దర్యాప్తులో సీసీ ఫుటేజీలు కీలకంగా మారాయని ఎస్పీ తెలిపారు. జడ్చర్లలో చోరీ అనంతరం నిందితులు బస్సు దిగిన సమయంలో సీసీ ఫుటేజీలను పరిశీలించామని, అయితే ఇక్కడ స్పష్టమైన ఆధారాలు లభించలేదన్నారు. జడ్చర్లలో సీసీ కెమెరాలు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారుగా గుర్తించి అక్కడకు నాలుగు పోలీస్ బృందాలను పంపినట్లు తెలిపారు. అక్కడి పోలీసుల సహకారంతో నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసి డబ్బును రికవరీ చేశామన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల వినియోగం ఎంతైనా ఉందని, ప్రజలు అవగాహన పెంచుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రెండు కుటుంబాల పొలం పంచాయితీ


గట్టు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆలూరు గ్రామస్తులు

- ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహంతో నిరసన
- గట్టు మండలం ఆలూరులో ఉద్రిక్తత

గట్టు: దాయాదుల మధ్య పొలం పంచాయితీ కారణంగా ఆలూరుకు చెందిన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, మృతదేహాన్ని మంగళవారం ఆలూరుకు తీసుకొచ్చారు. పొలం పంచాయితీ కారణంగానే ఆనంద్ (27) ఆత్మహత్య చేసుకున్నాడని, సమస్య తేల్చేదాక మృతదేహాన్ని ఖననం చేసేది లేదంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో రెండు కుటుంబాల మధ్య పొలం వివాదం మరింత ముదిరి గొడవలకు దారి తీయకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గట్టు, కేటీదొడ్డి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్ద రంగన్న, గోవిందు కుటుంబాలకు చెందిన వారితో పెద్దలు చర్చించారు. బాధిత కుటుంబసభ్యులతో పాటుగా మరికొంత మంది గట్టు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పొలం వ్యవహారంపై రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సాయంత్రానికి సమస్య కొలిక్కి రావడంతో అంత్యక్రియలను కుటుంబసభ్యులు సాయంత్రం ముగించారు.

ఇదీ పొలం పంచాయితీ

ఆలూరు చెందిన పెద్ద రంగన్న, గోవిందులు అన్నదమ్ములు. వారసత్వంగా వచ్చిన 4 ఎకరాల భూమిని గోవిందు తనతో పాటుగా కుటుంబసభ్యుల పేరున రికార్డుల్లో మార్చుకున్నట్లు పెద్ద రంగన్న కుమారులు ఆరోపిస్తూ వచ్చారు. న్యాయంగా మాకు రావాల్సిన వాటా భూమి 2 ఎకరాలను మాకు (పెద్ద రంగన్న కుమారులు) చేసి ఇవ్వాలని గ్రామంలో అనేక పర్యాయాలు పంచాయితీ పెట్టారు. ఇందులో పొలం ఇవ్వడానికి గోవిందు ఒప్పుకున్నట్లు పెద్ద రంగన్న కుమారులు తెలిపారు. అయితే భూ బదలాయింపు చేయకుండా కాలయాపన చేస్తుండడంతో పెద్ద రంగన్న కుమారుడు ఆనంద్ విసుగుచెంది పురుగు మందు తాగి, కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పొలం పంచాయితీ కారణంగానే ఆనంద్ ఆత్మహత్య చేసుకున్నాడని, పొలం ఇచ్చే దాకా మృత దేహాన్ని ఖననం చేయకుండా ఆందోళనకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఇరుక్కున్న బస్సు


మలుపు వద్ద రాళ్లల్లో ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు


పాతాళగంగ వద్ద నదిలో మునిగిన కారును గట్టుకు తెస్తున్న యువకులు

దోమలపెంట: ఇటీవల కురిసిన వర్షాలకు ఈగలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు శ్రీశైలం ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద నీటి ప్రవాహంతో రోడ్డు దిగువ భాగం కోతకు గురైంది. మంగళవారం శ్రీశైలం ఆనకట్ట వద్ద కృష్ణమ్మ పరవళ్లను వీక్షించడానికి పర్యాటకుల కార్లు ఇదే మలుపువద్ద నిలిపారు. దీంతో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వస్తున్న సూపర్ లక్సరి బస్సు మలుపు వద్ద లాంగ్‌కట్ తీసుకోలేక మలుపు దగ్గర నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఈ మలుపు వద్ద రోడ్డు దిగువ భాగం కోతకు గురవడంతో బస్సు టైర్లు ఒక్కసారిగా ఆ గుంతలో ఇరుక్కుపోయాయి. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు రమేష్, హరిలాల్ ఇతరుల సాయంతో బస్సును రోడ్డు పైకి తీసుకుని రావడం కోసం అష్టకష్టాలు పడ్డారు. ఎట్టకేలకు అతి కష్టంమీద బస్సు టైర్లను రాళ్ల మధ్య నుంచి వెలుపలికి తీసుకొచ్చారు.

కృష్ణానదిలో కొట్టుకుపోయిన కారు

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం చెందిన కృష్ణ, ఈశ్వర్, గురుచరణ్, రమేష్ శ్రీశైలం ఆనకట్ట వద్ద తిలకించడానికి మంగళవారం వచ్చారు. ఇదే సందర్భంలో కృష్ణానది కుడిగట్టు ప్రాంతం ఏపీ పరిధిలోని పాతాళగంగ వద్ద నదిలో స్నానం చేసేందుకు కారులోనే నేరుగా నది వద్దకు చేరుకున్నారు. వారు నదిలో స్నానం చేస్తుండగా శ్రీశైలం ఆనకట్ట వద్ద సోమవారం తెరిచి ఉంచిన మూడు గేట్లకు అదనంగా నాలుగు గేట్లను మంగళవారం పైకెత్తారు. నీటి ప్రవాహం అధికం కావడంతో కారు నీళ్లలో మునిగిపోయింది. గమనించిన వారందరూ స్థానికుల సాయంతో కారును నదిలో నుంచి గట్టుకు తీసుకొచ్చారు.

జాతీయస్థాయికి ఎదగాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎదగాలని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సత్యనారాయణగౌడ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్య భాస్కర్‌రెడ్డి అన్నారు. గత నెల 26 నుంచి 30 వరకు నేపాల్ దేశం పోఖ్రాలోని రంగసాల స్టేడియంలో ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. అందులో కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎండీ.అద్నానుద్దీన్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం ఘనంగా సన్మానించి, అభినందించారు. నేపాల్‌లో జరిగిన క్రికెట్ టోర్నీలో కళాశాల విద్యార్థి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో క్రికెట్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్ రాములు, డాక్టర్ నర్సింలు, డాక్టర్ వెంకటేశ్, మధుసూదన్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ త్రీడే లీగ్.. తొలిరోజు జిల్లా బౌలర్ల సత్తా

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో వర్షానికి మంగళవారం హెచ్‌సీఏ త్రీడే మహబూబ్‌నగర్–హైదరాబాద్ బుల్స్ జట్ల మధ్య మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తొలి రోజు ఆటలో ఉమ్మడి జిల్లా జట్టు బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ బుల్స్ జట్టు 20.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. జిల్లా బౌలర్ అరుణ్ 10 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, జైసింహ, గణేష్ చెరో వికెట్ తీశారు.



నాట్య మయూరి

కావేరమ్మపేట శివారులోని వ్యవసాయ పొలంలో మంగళవారం ఉదయం ఓ మయూరం పురి విప్పి నాట్యం చేస్తూ అక్కడి వారిని కనువిందు చేసింది. ఆహ్లాదకర వాతావరణంలో నెమలి నాట్యం చేస్తుండగా అక్కడి వారంతా తమ మొబైల్ ఫోన్లలో ఆ చిత్రాలను బంధించడం కనిపించింది. – జడ్చర్ల

గర్భస్థ శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడంటూ బంధువుల ఆందోళన
- వైద్యుడు, స్టాఫ్‌నర్స్‌ను సస్పెండ్ చేసిన అధికారులు


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రామచందర్‌రావు

పెబ్బేరు రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో గర్భస్థ శిశువు మృతిచెందిన ఘటన పెబ్బేరు పీహెచ్‌సీలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పెబ్బేరు పుర పరిధిలోని చెలిమళ్లకు చెందిన రాజేశ్వరికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి రెండు గంటలైనా ఏం చెప్పకపోవడంతో బంధువులు సిబ్బందిని ప్రశ్నించారు. విధుల్లో ఉన్న వైద్యురాలు డా. సుధారాణికి విషయం చెప్పడంతో ఆమె గర్భిణిని పరీక్షించి వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని మాత, శిశు సంరక్షణ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి సిజేరియన్ చేశారు. మగ శిశువు మృతిచెందగా.. తల్లి సురక్షితంగా బయటపడింది. శిశువు మృతితో ఆగ్రహించిన బంధువులు, కుటుంబ సభ్యులు పెబ్బేరు పీహెచ్‌సీకి చేరుకొని తలుపులు మూసి ఆందోళన చేపట్టారు. ఎవరూ స్పందించకపోవడంతో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లా ప్రోగ్రాం అధికారి రామచందర్‌రావు పెబ్బేరుకు చేరుకొని బాధితులతో మాట్లాడారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు విధుల్లో ఉన్న వైద్యులు ఎంఎల్‌హెచ్‌పీ డా. సుధారాణి, స్టాఫ్ నర్సు బాలమణిని సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆస్తి కోసం దారుణం

- సొంత అన్నను చంపి.. మృతదేహాన్ని స్కూటీపై తీసుకెళ్లి..
- ముఖానికి ముసుగు కప్పి.. ఏపీ సరిహద్దులో పడేసిన వైనం
- స్థానికులు గమనించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కర్నూలు పోలీసులు
- పెద్ద ధన్వాడలో కలకలం రేపిన సంఘటన


హత్యకు గురైన చిన్న

రాజోళి: ఆస్తి కోసం సొంత అన్ననే మట్టుబెట్టారు.. పైగా మృతదేహాన్ని ద్విచక్రవాహనం (స్కూటీ)పై తీసుకెళ్లి మరో ప్రాంతంలో పడేస్తూ పోలీసులకు చిక్కారు.. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడలో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా.. గ్రామానికి చెందిన చిన్న శేషిరెడ్డి(49), దుబ్బన్న, నాగిరెడ్డి ముగ్గురు అన్నదమ్ములు. వీరికి 12 ఏళ్లుగా పొలం తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో దుబ్బన్న కుమారుడు మహేశ్వర్‌రెడ్డిపై ఈ ఏడాది మే నెలలో చిన్న శేషిరెడ్డి దాడి చేశాడు. దీంతో ఆయనపై రాజోళి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జూన్ నెలలో వీరి సోదరి ఎర్రమ్మపై కూడా చిన్న శేషిరెడ్డి దాడి చేయడంతో ఆమె ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. ఇలాంటి ఘటనల నేపథ్యంలో చిన్న శేషిరెడ్డిపై అన్నదమ్ములు పగ పెంచుకున్నారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డి, దుబ్బన్న కుమారుడు మహేశ్వర్‌రెడ్డి సోమవారం చిన్న శేషిరెడ్డిని కర్నూలు జిల్లాలో అంతమొందించేందుకు ప్రణాళిక రూపొందించారు. అదే అదునుగా ఆయనను హత్య చేసి కర్నూలు జిల్లాలోని కొత్తకోట శివారులో పొలాల మధ్యలో.. లేదా.. తుంగభద్ర నదిలో పడేసే ఆలోచనతోనో మృతదేహానికి ముసుగు కప్పి స్కూటీపై తీసుకెళ్తుండగా.. గమనించిన స్థానికులు వెంబడించి కర్నూలు జిల్లా బెళగల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిన్న శేషిరెడ్డిని చంపింది సోదరుడు చిన్న నాగిరెడ్డి, మరో సోదరుడి కుమారుడు దుబ్బన్న కుమారుడు మహేష్‌రెడ్డి అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

గ్రామస్తుల్లో ఆందోళన..

చిన్నశేషిరెడ్డి హత్యతో పెద్దధన్వాడలో అలజడి నెలకొంది. హత్యకు గురైన చిన్న శేషిరెడ్డి అంత్యక్రియలు మంగళవారం గ్రామంలో నిర్వహించగా నిశ్శబ్ద వాతావరణం ఆవహించింది. అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టిన ఆస్తి తగాదాలు గ్రామంలో రాబోయే కాలంలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని రాజోళి ఎస్‌ఐ జగదీశ్వర్ హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్ గస్తీ నిర్వహిస్తున్నామని చెప్పారు.